# డల్లాస్, ఫోర్ట్‌వర్త్ కౌన్సిల్లో తోటకూర ప్రసాద్



డల్లాస్: డల్లాస్, ఫోర్ట్‌వర్త్ ప్రపంచ వ్యవహారాల కౌన్సిల్‌లో డైరక్టర్‌గా ప్రసాద్ తోటకూర నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టిన వారిలో ప్రసాద్ తొలి ప్రవాసాంధ్రుడు. అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన పెంపొందించడంతోపాటు, వివిధ దేశాల మధ్య సత్సంబంధాలను కొనసాగించేందుకు కమిటీ కృషిచేస్తుంది. ఈ కౌన్సిల్ అధ్యక్షుడిగా జిమ్‌ఫాల్క్ వ్యవహరిస్తారు. **1951** సంవత్సరంలో ఏర్పాటైన కౌన్సిల్ లాభపేక్షలేకుండా సేవాదృక్పథంతో పనిచేస్తోంది. ప్రతిఏటా లక్షమంది విద్యార్థులు అంతర్జాతీయ విద్యావకాశాలు పొందేందుకు తోడ్పడుతోంది. కౌన్సిల్‌లో డైరక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. ఇది గొప్ప సదవకాశమని తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతల్ని అనుభవజ్ఞులైన ఇతర డైరక్టర్ల సహాయంతో కౌన్సిల్ ప్రతిష్ఠను పెంచడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇండో-అమెరికన్ కమ్యూనిటీల సహాయ, సహకారాలు తనకు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.